# లిఫ్ట్

రిస్ట్‌వాచ్ చూసుకున్నాడు వరుణ్. టైమవుతోంది. తొందరగా వెళ్లిపోవాలి, అనుకుంటూ గబగబా తయారయ్యాడు. హడావుడిగా టిఫిన్ కానిచ్చేసి వెళ్లొస్తానని శ్రీమతికి చెప్పి బయటపడ్డాడు.

ఆఫీసుకి రోజూ తొందరగానే వెళ్లాలనుకుంటాడు. కానీ ఏదోవిధంగా లేటవుతూనే వుంటుంది.

స్కూటర్‌తీసి, లంచ్‌బాక్స్ డిక్కీలో పడేసి, యాభై స్పీడ్‌తో బయల్దేరాడు ఆఫీసుకి. అలా రోడ్డుమీదకి వచ్చి మెయిన్‌రోడ్‌కి చేరాడో లేదో రెడ్ సిగ్నల్ పడింది. ఉసూరుమంది ప్రాణం.

షిట్... అనుకున్నాడు అసహనంగా.

'ఇదివరకే కాస్తో కూస్తో లేటనుకుంటే ఈ రెడ్ సిగ్నల్ ఒకటి' విసుక్కుంటూ స్కూటర్ని స్లో చేశాడు.

అతని మనసుని ఆలోచనలు చుట్టుముట్టాయి.

ఆఫీసర్ అసలే స్ట్రిక్టు మనిషి, మొన్నొక రోజున ఆలస్యంగా ఆఫీసులోకి అడుగిడితేనే గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు. పది గంటలకి వెళ్లాల్సింది పదకొండు అయ్యిందారోజు.

'తరచూ లేటవుతోందని, మెమో ఇష్యూ చేస్తా'నని బెదిరింపొకటి రువ్వాడు.

సంజాయిషీగా బోలెడు కారణాల్ని వెళ్ళగక్కుకొని, "ఫస్ట్ టైమ్ సార్ ఇంతగా లేటవడం" అంటూ బ్రతిమిలాడితే వదిలేశాడు.

అయినా ఏదో ఐదూ, పది నిమిషాలు లేటయితే సర్దిచెప్పొచ్చు. కానీ అరగంటో, ముప్పావుగంటో తేడా అయితే మాత్రం ఈసారి గురుడు వినడుగాక వినడు. క్యాజువల్ లీవ్ ఇవ్వడు సరికదా, ఏకంగా వన్‌డే శాలరీ కట్ అంటాడు.

గ్రీన్ సిగ్నల్ పడింది.

పరుగు పందానికి విజిల్ ఊదినట్టు ఒక్కసారిగా వాహనాల్లో కదలిక. ఆలోచనల్లకి బ్రేకుపడి, వరుణ్ స్కూటర్ కూడా స్పీడందుకుంది.

కొంతదూరం వెళ్లాడో లేదో ఎవరో చేయెత్తి ఆపమన్నట్లు సైగచేశారు.

సడెన్ బ్రేకు వేసి స్కూటర్ ఆపాడు.

"ఎవరబ్బా" అనుకుంటూ ఆ వ్యక్తి మొహంలోకి తొంగి చూస్తే తెలిసిన శాల్తీయే కాదు.

విసుక్కుంటూ "ఏంటయ్యా ఇదేమైనా ఆర్టీసీ బస్ అనుకున్నావా? చెయ్యెత్తగానే ఆగడానికి" అన్నాడు.

వరుణ్ దెప్పిపొడుపుకి అతను ఫీలవలేదు.

"లిఫ్ట్ కావాల్సార్!" చాలా సౌమ్యంగా, వినయం ఉట్టిపడేలా అడిగాడు.

"ఇంకా నయం, స్కూటర్ కావాలని అన్లేదు" అడిగిన వ్యక్తిని ఎద్దేవా చేశాడు వరుణ్.

ఆ కామెంట్‌ని పట్టించుకోకుండా "ప్లీజ్ సార్" ప్రాధేయపడ్డాడతను.

"ఆఫీసుకి లేటవుతోందని నేను హడలిచస్తుంటే మధ్యలో నీ గొడవేంటయ్యా బాబూ!" తల కొట్టుకున్నాడు వరుణ్.

"క్షమించండి సార్, అర్జంటుగా వుంటేనూ... "గొణిగాడా వ్యక్తి.

"అంత అర్జంటైతే ఆటోలో వెళ్లక నా వెంటపడ్డావేం?" అంటూ తన కుడికాలుని కిక్‌రాడ్ మీదకి మళ్లించాడు.

'చూస్తే తనకంటే వయసులో చాలా పెద్దాయన్లా కనిపిస్తున్నాడు. లిఫ్ట్ కావాలంటూ తనని విసిగిస్తున్నాడేమిటి?' అనుకున్నాడు వరుణ్.

ఇలా లిఫ్ట్ అడిగే వాళ్లంటే కోపం, చిరాకు అతనికి.

"ఈరోజు ఆటో స్ట్రైక్ సార్. దీనికి తోడు సిటీ బస్సుల్నిండా ఊపిరాడని జనం. నేనొచ్చినప్పటి నుండి పది బస్‌లు వెళ్లాయండీ! ఒక్కటి కూడా ఈ స్టాప్ దగ్గర ఆగలేదు" కళ్ళతో అర్థిస్తూనే విషయం చెప్పాడతను.

"మరలాంటప్పుడు స్కూటర్ కొనుక్కోవచ్చు కదా. ఊహూ అది మాత్రం వద్దు. తేరగా వచ్చే లిఫ్ట్‌లు మాత్రం కావాలి. ఖర్చులేని పని కదా ఇది. మీలాంటి వాళ్ళ తంతే ఇంత" హేళనగా అన్నాడు.

ఓవైపు టైమైపోతోందని టెన్షన్‌గా వుందతనికి. 'మరోవైపు వెళ్లనీయకుండా జిడ్డులా తగిలాడేంట్రా బాబూ!' అనుకున్నాడు మనసులో.

వరుణ్ మాటల్ని లిఫ్ట్ అడిగిన వ్యక్తి వేరేలా అర్థం చేసుకున్నాడు.

"అలా ఏం లేదార్. ఆటో కిరాయికి సరిపడా డబ్బులిస్తాను. అవి తీసుకునే లిఫ్ట్ ఇవ్వండి" అన్నాడు.

ఆ వ్యక్తి మాటల్లో ప్రతిధ్వనిస్తున్న నిజాయితీ, అతడి చూపుల్లో ప్రతిబింబిస్తున్న అవసరం వరుణ్ మనసుని కరిగించలేకపోయాయి.

"ఏంటీ, ఏంటా పిచ్చి పిచ్చి వాగుడు. చెవిలో పువ్వు, తలకి రుమాలుగానీ కన్పిస్తోందా! డబ్బులు తీసుకుని లిఫ్ట్ ఇవ్వడమా? ఇదెక్కడి విడ్డూరమయ్యా బాబూ! ప్రొద్దున్నే భలేగా తగిలావ్" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడక్కడి నుండి.

✤ ✤ ✤

"వ్వాట్!"

ఫోన్లో వచ్చిన వార్తకి పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు వరుణ్. ఆ కబురు చెవిలో పడిన మరుక్షణం కాళ్లూచేతులూ ఆడడం లేదతనికి.

స్కూల్ నుండి వస్తోన్న తమ బాబుకి రోడ్ క్రాస్ చేస్తుంటే ఆక్సిడెంట్ అయ్యిందట. హాస్పిటల్ నుండి భార్య నిర్మల ఫోన్ చేసి చెప్పింది.

టైమ్ చూశాడు. నాలుగున్నర అవుతోంది.

గబగబా ఆఫీసర్ గదిలోకి ప్రవేశించి విషయం చెప్పి, పర్మిషన్ తీసుకుని ఉన్న ఫలంగా బయటపడ్డాడు.

టెన్షన్‌తో హాస్పిటల్‌కి చేరుకున్నాడు.

భార్య ఫోన్లో అందించిన వివరాల ప్రకారం బెడ్ నెంబర్ సులువుగానే దొరికింది. కంగారుపడుతూ బాబు దగ్గరకు చేరాడు.

పిల్లవాడికి సెలైన్ ఎక్కుతోంది. స్పృహలో లేడు.

"పెద్దగా ఆందోళన పడాల్సిందేమీ లేదని డాక్టరుగారు చెప్పారు. బాబుకి ప్రమాదమేం లేదు. మోకాళ్ళు మోచేతులు గీరుకుపోయాయి. తలకి మాత్రం గాయమై రక్తం బాగా పోయింది. తలకి కట్టు కట్టారు" వరుణ్ వచ్చి రావడంతోనే టకటక చెప్పేసింది నిర్మల.

అప్పుడు గాని అతని మనసు కుదుటపడలేదు.

బెడ్ వంక చూస్తూ "బాబు నిద్రపోతున్నాడేంటీ ?" అనడిగాడు.

"తగిలిన దెబ్బలకి వాడు కేకలు పెడుతోంటే, రిలీఫ్ కోసమని డాక్టర్ మత్తు ఇంజక్షన్ ఇచ్చారు" చెప్పింది.

"ఈరోజు హాస్పిటల్‌లోనే ఉంచేయమన్నారా బాబుని?" ప్రశ్నించాడు.

"మీరు వచ్చే ముందరే నర్స్ చెకప్ చేసి వెళ్లింది బాబుని. మరో పది, పదిహేను నిమిషాల్లో మత్తు దిగిపోతుందట. అరగంటలో డిశ్చార్జ్ కావచ్చంది"

"ఇంతకీ ఆక్సిడెంట్ ఎలా జరిగింది?" అడిగాతను.

తాను విన్న విషయాన్ని భర్తకి చెప్పింది. తృటిలో తప్పింది ప్రాణాపాయం.

'పోన్లే, ఆక్సిడెంట్ ప్రాణాల మీదికి తేలేదు. థాంక్ గాడ్!' అనుకొని గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"మన బాబుని ఆక్సిడెంట్ నుండి కాపాడ్డమే కాదు. హాస్పిటల్లో చేర్పించింది కూడా ఈయనే" ఓ పక్కన నిలబడి వున్న వ్యక్తిని చూపిస్తూ అంది నిర్మల.

తన ఉనికి ఇతరులు గుర్తించని విధంగా గోడకి చేరగిలబడి వున్నాడతను.

అతన్ని చూడగానే వెయ్యి వోల్టుల షాక్ తగిలినట్టు బిగుసుకుపోయాడు వరుణ్.

అతనెవరో కాదు, ఉదయం ఎవరైతే తనని లిఫ్ట్ కావాలని సాయం అడిగారో అదే వ్యక్తి !

"ఇదిగోండి మావారు" అతనికి భర్తని చూపెట్టింది నిర్మల.

ప్రతిగా వరుణ్ వంక చూస్తూ చేతులెత్తి నమస్కరించాడు తను మర్యాదగా.

అప్రయత్నంగా వరుణ్ చేతులు పైకి లేచాయి.

ఆ వ్యక్తి చూపులు అప్పుడూ, ఇప్పుడూ ఒకేలా నిర్మలంగా వున్నాయి. వరుణ్ చూపుల్లోనే తేడా. ఉదయం నిప్పులు చెరిగితే, ఇప్పుడు కృతజ్ఞతని వర్షిస్తున్నాయి. సిగ్గుతో తలదించుకున్నాడు.

"మిమ్మల్ని క్షమించమనే అర్హత కూడా కోల్పోయాను. కేవలం లిఫ్ట్ అడిగినందుకే ఉదయం మీ పట్ల చాలా దురుసుగా ప్రవర్తించాను. అవకాశం ఉండీ లిఫ్ట్ ఇవ్వకుండా ఎగతాళి చేసాను. కానీ మీరు కూడా నాలాగే నిర్లక్ష్య వైఖరి వహిస్తే మా అబ్బాయి పరిస్థితి ఎలా వుండేది? ఊహించడమే కష్టంగా వుంది" అంటూ అతని చేతులు పట్టుకున్నాడు వరుణ్ తప్పుని మన్నించమన్నవాడిలా.

అప్పటి వరకు మౌనంగా వున్న ఆ వ్యక్తి నెమ్మదిగా గొంతు విప్పాడు.

"ఇలాంటివన్నీ మీకు, మీలాంటి వాళ్లకు పూలిష్‌గాను, సిల్లీగాను అనిపిస్తుండొచ్చు. **ఎదుటి వారికి అవసర వేళలో సాయపడ్డం నామోషీ అని భావిస్తుండొచ్చు. కానీ అది మానవధర్మం. పరోపకారం చేయడంలో లభించే ఆనందాన్ని మించింది ఈ ప్రపంచంలో మరొకటి లేదు"** అన్నాడతను ఒక సత్యాన్వేషిలా.

వరుణ్ కళ్ళు దించుకున్నాడు.

వాళ్ళ మాటలు మొదట నిర్మలకు అర్థం కాలేదు. కానీ భర్త స్వభావం తెలుసు కాబట్టి వాళ్ళిద్దరి సంభాషణను బట్టి జరిగిందేమిటో ఊహించగలిగింది.

"మీ ఆవిడ వుండమంటే మీరొచ్చే వరకూ వున్నానిక్కడ. ఒక వ్యక్తికి సాయం చేసానన్న తృప్తిని మిగుల్చుకున్నాను. నాకదే చాలు. నేనిక వెళతాను" అన్నాడా వ్యక్తి భార్యాభర్తలిరువురి వంక చూస్తూ.

"మావారు మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతారు, ఆగండి" అంటూ అతన్ని వారించింది నిర్మల.

ఇటు తిరిగి భార్తతో అంది.

"ఏమండీ! బుజ్జిగాడీ అవస్థలో స్కూటర్‌మీద కూర్చోలేడు. వాడు స్పృహలోకి రాగానే హాస్పిటల్ చార్జీలు పే చేసి ఆటోలో వచ్చేస్తాం. మీరీయన్ని తీసుకుని వెళ్ళండి"

సరేనంటూ వరుణ్ తలూపాడు.

"రండి, వెళదాం" అంటూ సాదరంగా ఆహ్వానించాడతన్ని.

"మీ ఆఫర్‌కి థాంక్స్, స్ట్రైక్ కాలాఫ్ అయ్యిందట. ఫర్లేదు నేను ఆటోలో వెళ్తాను.

మీకా(శమ అక్కర్లేదు. మీరెళ్లండి" అన్నాడతను బయల్దేరబోతూ.

"చేసిన పనికి నా మనసిప్పటికీ పశ్చాత్తాపంతో దహించుకుపోతోంది. మళ్లీ మీరిలా అనడం బాగోలేదు. చచ్చిన పాముని చంపడం భావ్యమూ కాదు" అన్నాడు వరుణ్ గిల్టీగా ఫీలవుతూ.

"అదికాదు..." ఏదో అనబోయాడతను.

మధ్యలో అడ్డుపడి, "క్షమించమన్నాగా! నా తత్వాన్ని మార్చుకున్నాను. నిజం చెప్పాలంటే నేనీ క్షణం నుండి ఉదయం మీరు చూసిన వరుణ్‌ని కాను. నన్ను నమ్మండి. నిజానికి లిఫ్ట్ అడగడమే సిగ్గులేని పనంటూ, అలాంటి వారిని ఏవగించుకునే వాడిని. కానీ ఇప్పుడలా కాదు. నాలోని అహాన్ని తొలగించుకుంటున్నాను. లిఫ్టేకాదు పొరుగువారి అవసరాన్ని బట్టి నా స్కూటరే ఇస్తాను" చెప్పుకుపోతున్నాడు వరుణ్.

తప్పదు, అన్నట్లు వింటుండి పోయాడా వ్యక్తి.

"మా వీధిలో వాళ్లకి ఏ అవసరం పడ్డా, వాళ్ళు ఎంతగింజుకున్నా నా స్కూటర్ ఇచ్చేవాణ్ణి కాదు. మరీ (ప్రాణం మీదకు వచ్చే పనైతే మా(తం నేనే స్వయంగా వెంట వెళ్లి వచ్చేవాడిని. అలాగే ముక్కూ మొహం తెలియని వాళ్లెవరైనా లిఫ్ట్ అడిగితే కసురుకునేవాణ్ణి.

అలాంటిద్ది ఈ సంఘటనతో నా కళ్ళు తెరుచుకున్నాయి. మూర్ఖత్వం వదిలి వాస్తవంలో పడ్డాను. నా గురించి మీకు తెలియని విషయాలివన్నీ. తెలియాల్సినవేం కాదు. నేను చెప్పాల్సిన అవసరం అంతకన్నా లేదు. కానీ నేను మారిపోయాననడానికి నిదర్శనంగా మీకివన్నీ చెప్పాను. నా అంతరంగాన్ని మీ ముందుంచాను" అంటూ ఆగాడు.

నిర్మల విస్తుపోయి చూస్తోంది భర్తని.

ఒప్పుకోక తప్పింది కాదతనికి. మౌనంగా వరుణ్ వెంట నడిచాడు.

**(4.10.2001)**

*